క్లుప్తంగా

29న బండలాగుడు పందేలు

రాచర్ల: మండల కేంద్రం రాచర్ల పట్టాభిరామ స్వామి ఆలయ 13వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 29వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు ఎడ్ల బండలాగుడు పందేల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్ల పరమేశ్వరరెడ్డి, ఈ.శివరంగారెడ్డి, పాండురంగారెడ్డి, సుబ్బారెడ్డిలు గురువారం తెలిపారు. ఆసక్తి ఉన్న ఎడ్ల యజమానులు ఆ రోజు ఉదయం 7 గంటల్లోపు రూ.500 రుసుం చెల్లించి తమ ఎడ్లజతల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఎండ్ల పందేల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.40 వేలు, రెండో బహుమతి రూ. 30 వేలు, మూడో బహుమతి రూ.20, నాలుగో బహుమతి రూ.10 వేలు, ఐదో బహుమతి రూ.5 వేలు చొప్పున అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 90107 93991, 95734 25911, 81604 457761, 99086 70032 నంబర్లకు ఫోన్ చేయాలని నిర్వాహకులు కోరారు.

కర్ణాటక భక్తులకు అన్నదానం



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ

మార్కాపురం టౌన్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కర్ణాటకకు చెందిన వేలాది మంది భక్తులు శ్రీశైలంలో అమ్మవారిని దర్శించిన అనంతరం తిరుగు ప్రయాణంలో గురువారం మార్కాపురం రైల్వే స్టేషన్‌కు వచ్చారు. మార్కాపురం భోజన వసతి మిత్రమండలి ఆధ్వర్యంలో సుమారు 5 వేల మంది యాత్రికులకు రైల్వే స్టేషన్ వద్ద అల్పాహారం, భోజనం అందించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, మాజీ కౌన్సిలర్ వక్కలగడ్డ మల్లికార్జున్ ప్రారంభించారు. కార్యక్రమంలో మిత్రమండలి సభ్యులు చక్కా మాలకొండ నరసింహారావు, తాళ్లపల్లి ఆదినారాయణ, ఉటుకూరి రామకృష్ణరావు, ఆర్‌కేజీ నరసింహం, పొప్పరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

27న ఆలయ భూములకు కౌలు వేలం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని శ్రీ పాతాళనాగేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన భూములను కౌలుకు ఇచ్చేందుకు ఈ నెల 27వ తేదీన వేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాటదారుడు రూ.2 వేలు ముందుగా రుసుం చెల్లించి పాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఆకాశంలో మబ్బులు..

రైతుల గుండెల్లో గుబులు



తర్లుపాడులో మేఘావృతమైన ఆకాశం



కల్లాల్లో ఆరబోసిన మిర్చి

- పశ్చిమ ప్రకాశంలో 18,334 హెకార్లలో మిర్చి సాగు
- వర్షాలు కురిస్తే రైతులకు తీవ్ర నష్టం

తర్లుపాడు: అకాల వర్షాలు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. ఉపరితల ద్రోణి ప్రభావంతో నాలుగైదురోజులుగా అక్కడక్కడా భారీ వర్షాలు కురవడంతో, తరచూ ఆకాశం మేఘావృతం అవుతుండటంతో రైతుల్లో తీవ్ర ఆందోన నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. మార్కాపురం నియోజకవర్గంలో 5,312 హెక్టార్లలో, యర్రగొండపాలెంలో 11, 512 హెక్టార్లలో, గిద్దలూరులలో 1500 హెక్టార్లలో మిర్చి సాగు చేశారు. మూడు నియోజకవర్గాల్లో కలిపి వెయ్యి హెక్టార్లలో పత్తి సాగవుతోంది. మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు, పెద్దదోర్నాల, కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట, యర్రగొండపాలెం, పుల్లలచెరువు తదితర మండలాల్లో మిర్చి అధికంగా సాగు చేశారు. వర్షం పడితే మిరపకాయలు, పత్తి తడిసి నాణ్యత తగ్గే అవకాశం ఉండటమే రైతులు ఆందోళనకు కారణం. గత వారం కురిసిన అకాల వర్షానికి కళ్లాల్లో ఆరబోసిన మిర్చి తడిసి రైతులు నష్టపోయారు.

రెండు రోజుల నుంచి సాయంత్రం పూట ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటుండటంతో రైతుల్లో మరోమారు ఆందోళన మొదలైంది. ఇదిలా ఉండగా కూలీలు దొరక్క కొంత మంది రైతులు పత్తిని పొలంలోనే వదిలేస్తున్నారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి

- డీఎస్పీ కిషోర్‌కుమార్



రక్తదాత ప్రసాద్‌ను సన్మానిస్తున్న డీఎస్పీ కిషోర్

మార్కాపురం టౌన్: యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని డీఎస్పీ డాక్టర్ ఎం.కిషోర్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని, ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడేందుకు రక్తం ఉపయోగపడుతుందన్నారు. సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ప్రజా సంఘాలకు సూచించారు. తొలుత భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ డాక్టర్ కనకదుర్గ, వైస్ చైర్మన్ ఆర్‌కేజే నరసింహం, మానవత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు వనజాక్షి, ప్రజా సంఘాల నాయకులు సోమయ్య, యస్‌కె అబ్దుల్ రజాక్, రుబెన్, రాజు, కాశయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, లోకేష్, వేశపోగు సుదర్శన్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు డి.మోహన్‌రెడ్డి, బీజేయూ నాయకులు ఎస్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతకు అభినందన

మార్కాపురం పట్టణానికి చెందిన ఆర్‌ఎస్ ప్రసాద్ 61 పర్యాయాలు రక్తదానం చేసిన సందర్భంగా డీఎస్పీ కిషోర్‌కుమార్, డాక్టర్ కనకదుర్గ సన్మానించారు. ప్రసాద్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందిపై సబ్ కలెక్టర్ ఆగ్రహం

మార్కాపురం: మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది వ్యవహారంపై సబ్ కలెక్టర్ సేథు మాధవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం ఆయన కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయంలోకి అనధికార వ్యక్తులు ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తున్నా సిబ్బంది పట్టించుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలా అయితే ప్రభుత్వ రికార్డులకు భద్రత ఎలా ఉంటుందని ప్రశ్నించారు. పనితీరు మార్చుకోవాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని చెప్పారు.

జమ్మన్నపల్లిలో 8 డీప్ బోర్లు సీజ్

మార్కాపురం: మండలంలోని జమ్మన్నపల్లి గ్రామంలో ప్రభుత్వ భూమిలో అనధికారికంగా వేసిన 8 డీప్ బోర్లను గురువారం అధికారులు సీజ్ చేశారు. అనధికార బోర్ల ఏర్పాటు వల్ల నీటి సమస్య తలెత్తిందని స్పందనలో ఇటీవల గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది వెళ్లి వాటి విద్యుత్ కనెక్షన్లు తొలగించారు.

పోషకాహారంతో ఆరోగ్యం

పొదిలి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని మాజీ ఎంపీపీ కె.నరసింహారావు పేర్కొన్నారు. గురువారం కంభాలపాడు సచివాలయంలో పోషణ పక్షోత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజారోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. చిరుధాన్యాల ప్రయోజనాలపై సూపర్‌వైజర్ సుభాషిణి అవగాహన కల్పించారు. పోషక పదార్థాల ప్రదర్శన, బాలబాలికలకు పోటీలు, సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పంచాయతీలకు 'చెత్త' సంపద



మాట్లాడుతున్న డీఎల్‌పీవో నాగేశ్వరరావు

యర్రగొండపాలెం: పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకునేందుకు సేకరించిన చెత్త ఎంతగానో ఉపయోగపడుతుందని మార్కాపురం డీఎల్‌పీవో జి.నాగేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక కొలుకుల రోడ్డులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికులు తడి, పొడి చెత్తలను వేరుగా సేకరించి వర్మీ కంపోస్టు తయారు చేసుకోవచ్చని, దీంతో పంచాయతీలకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. అనేక ప్రాంతాల్లో ఇప్పటికే చెత్త నుంచి ఎరువులు తయారు చేసి ఎక్కువ మొత్తంలో ఆదాయం పొందుతున్నారని, ఈ మేరకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. శిక్షణ తరగతుల్లో అర్ధవీడు ఎంపీడీవో వీరభద్రాచారి, జిల్లా రీసోర్స్‌పర్సన్ రామకృష్ణ, డీపీఆర్సీ సురేష్, ఈవోఆర్డీ రామసుబ్బారెడ్డి, ఈవో ఈదుల రాజశేఖరరెడ్డి, యర్రగొండపాలెం, పాపినేనిపల్లె సర్పంచ్‌లు అరుణాబాయి, మల్లేశ్వరి పాల్గొన్నారు.

సేవాభావం కలిగి ఉండాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



క్లినిక్‌ను ప్రారంభిస్తున్న వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి

దర్శి: ఆస్పత్రిలో సేవాభావంతో సేవలందించాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి సూచించారు. ప్రముఖ హోమియో వైద్యులు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్ఎం బాషా జమాల్ నరింగ్ హోమ్‌లో హోమియోపతి ఆస్పత్రిని వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డిలు గురువారం ప్రారంభించారు. అనంతరం ఉచిత అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డిలు మాట్లాడుతూ హోమియో వైద్యులు ఎస్ఎం బాషా ఆస్పత్రిలోనే కాకుండా సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో కూడా ముందుంటారని పేర్కొన్నారు. ఆస్పత్రిని ప్రారంభించడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. వైద్యులు జమాల్ నాయక్, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, వైఎస్సార్ సీపీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వెంకట్రామయ్య స్వామి తిరునాళ్ల



ముస్తాబైన భగవాన్ వెంకట్రామయ్య ఆలయం

తాళ్లూరు: భగవాన్ వెంకట్రామయ్య స్వామి తిరునాళ్ల బుధవారం రాత్రి ఉత్సాహంగా నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా భక్తులు వెంకట్రామయ్య స్వామిని సందర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వంశస్తులు ఐసీ కోటిరెడ్డి బంధువర్గం ముందుగా ప్రత్యేక పూజలు చేసింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పొంగళ్లు పెట్టుకొని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో పశుసంపద, కోడెలు, ఎద్దులను ఊరేగింపుగా తప్పెట్లతో స్వామి ఆలయం వద్దకు తీసుకెళ్లి ప్రదక్షిణలు చేయించారు. పశుసంపద వృద్ధి చెందాలని స్వామి వారిని రైతులు వేడుకున్నారు. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని స్వామి వారిని వేడుకున్నారు. స్వామి వంశస్తులు అన్నదానం చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్



దుస్తులు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

పుల్లలచెరువు: విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని త్రిపురాంతకం ఎంఈవో తులసి మల్లికార్జుననాయక్ అన్నారు. గురువారం పుల్లలచెరువు పాఠశాలలో హెచ్ఎం ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తులసి మల్లికార్జుననాయక్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని కష్టపడి చదివినప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రభుత్వం అందించే వివిధ రకాల పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జానీబాషా తన సొంత డబ్బులతో రంజాన్ పండగను పురస్కరించుకుని గ్రామంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు దుస్తులు ఉపాధ్యాయుల చేతుల మీదగా పంపిణీ చేశారు.

ఎరువుల నిల్వలు తనిఖీ చేసిన మార్క్‌ఫెడ్ డీఎం



స్టాక్‌ను తనిఖీ చేస్తున్న ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ

బేస్తవారిపేట: మండలంలోని పిటికాయగుళ్ల, పూసలపాడు, బేస్తవారిపేట రైతు భరోసా కేంద్రాల్లోని ఎరువుల నిల్వలను ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం కాకర్ల హరికృష్ణ గురువారం తనిఖీ చేశారు. స్టాక్, అమ్మకం రిజిస్టర్‌లు, ఆన్‌లైన్ స్టాక్, ఆర్‌బీకేల్లో నిల్వ ఉంచిన ఎరువులను పరిశీలించారు. స్టాక్ అమ్మిన వెంటనే నగదును ఏపీ మార్క్‌ఫెడ్‌కు జమ చేయాలని సూచించారు. గిద్దలూరు వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు బాలాజీనాయక్, సాంకేతిక వ్యవసాయాధికారి షేక్ బాషా, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై దాడులు

త్రిపురాంతకం: ఎరువులు, పురుగుమందుల దుకాణాలపై అధికారులు గురువారం దాడులు చేశారు. రికార్డులు సక్రమంగా లేని దుకాణాలపై కఠిన చర్యలు తప్పవని వ్యవసాయశాఖ ఏడీఏ రమాదేవి, ఏఓ కె.నీరజ హెచ్చరించారు. రాఘవేంద్ర ఫర్టిలైజర్స్, సుబ్రహ్మణ్యేశ్వర ట్రేడర్స్, మన గ్రోమోర్ సెంటర్, కిసాన్ అగ్రిమాల్‌ను తనిఖీ చేసి స్టాక్ బుక్‌లో ఎంట్రీ చేయని, బిల్లు పుస్తకాలు, ఎరువులు తేడాలు పరిశీలించి రెండు లక్షల రూపాయల ఖరీదు చేసే ఎరువుల అమ్మకాలు నిలిపేసినట్లు అధికారులు తెలిపారు. దాడుల్లో సాంకేతిక వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా...

వేడుకగా బొల్లావుల ఉత్సవం




పూజలందుకుంటున్న బొల్లావులు

కొనకనమిట్ల: శోభకృత్ నామ సంవత్సర ఉగాది పండగను పురస్కరించుకుని గురువారం చినమనగుండం గ్రామంలో కాటంరాజు, గంగాభవానికి పూజలు చేశారు. కులాలకు అతీతంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఏడాది ప్రకృతి అనుకూలించి, పాడిపంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని గంగమ్మతల్లి ఆలయంలో పూజలు చేశారు. బొల్లావుల ఊరేగింపు ఉత్సాహంగా సాగింది.

నేడు బహిరంగ వేలం

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ పరిధిలోని కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్, మాంసం విక్రయం మార్కెట్‌లో రోజు వారి రుసుం కట్టించుకునే వేలం పాట శుక్రవారం ఉదయం 11 గంటలకు స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్నారు. ఈ మేరకు కమిషనర్ వై.రామకృష్ణయ్య గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఘనంగా ప్రపంచ జల దినోత్సవం



ర్యాలీలో పాల్గొన్న గ్రామస్తులు, ప్రాజెక్టు అధికారులు

తర్లుపాడు: రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలో ప్రపంచ జల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు నీరు వినియోగంపై అవగాహన కల్పించారు. ఫౌండేషన్ జిల్లా ప్రాజెక్టు అధికారి బాబురావు మాట్లాడుతూ.. చెక్ డ్యామ్ నిర్మాణాలు, చెరువుకట్టలను బలోపేతం చేయడం, ఫారం పాండ్ నిర్మాణాలను ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ప్రెజెంటర్ సునీల్, ఎఫర్ట్ సంస్థ ప్రతినిధి నారాయణరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేగవంతంగా సైడు కాలువల నిర్మాణం



కాలువలో మురుగు తీస్తున్న జేసీబీ

దొనకొండ: స్థానిక రైల్వే ఆవరణ నుంచి ఇండియన్ పెట్రోలు బంకు వరకు అధికారులు సైడు కాలవ పనులు చేపట్టారు. గ్రామస్తులు సైడు కాలవలు లేకపోవడంతో వర్షాకాలం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుకాణదారులకు వర్షా కాలం ఇబ్బంది కరంగా ఉండేది. ప్రభుత్వం అందించిన స్పెషల్ గ్రాంట్ రూ.2.60 కోట్ల నిధులతో సిమెంట్ రోడ్డు, సైడు కాలవల పనులు చేస్తున్నారు. తారు రోడ్డు పూర్తి చేశారు. ప్రజలకు, వాహన చోదకులకు ఇబ్బందులు లేకుండా పనులు పూర్తి చేస్తామని అధికారులు పేర్కొన్నారు.

29న మండల సర్వసభ్య సమావేశం

బేస్తవారిపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు హాలులో ఈ నెల 29న ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.చెన్నకేశవరెడ్డి తెలిపారు. మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యుడు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

వైఎస్సార్ సీపీ దివ్యాంగుల కమిటీలు ఏర్పాటు

మార్కాపురం: వైఎస్సార్ సీపీ మండల స్థాయి దివ్యాంగుల కమిటీలను ఏర్పాటు చేసినట్లు జిల్లా అధ్యక్షుడు దొంతిరెడ్డి గోపాల్‌రెడ్డి తెలిపారు. మార్కాపురం టౌన్ అధ్యక్ష కార్యదర్శులుగా ఎస్‌వీ రమణారెడ్డి, వి.అశోక్ ఉపాధ్యక్షుడిగా సయ్యద్ రెహమాన్, మార్కాపురం రూరల్ అధ్యక్షుడిగా ఎల్.శేఖర్, పొదిలి టౌన్, రూరల్ అధ్యక్షులుగా డి.ఆంజనేయులు, బీవీ నరసింహారావు, కొనకనమిట్ల అధ్యక్షుడిగా ఎస్.బాలచంద్రుడును నియమించినట్లు గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న వైద్యుడు

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సు పీహెచ్‌సీ వైద్యాధికారి బంకా రత్నం అధ్యక్షతన నిర్వహించారు. హెచ్‌సీజీ, ఎంఎస్ఆర్ క్యాన్సర్ సెంటర్ అంకాలజిస్ట్ డాక్టర్ రమణారెడ్డి మాట్లాడుతూ స్త్రీలు, పురుషుల్లో క్యాన్సర్ వచ్చే పరిస్థితులు, కారకాలను వివరించారు. క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పొగాకు వినియోగించడం, రెగ్యులర్ ఎక్సర్‌సైజులు, బయట ఆహారానికి దూరంగా ఉంటే క్యాన్సర్‌కు దూరంగా ఉండవచ్చని సూచించారు. పీహెచ్ఎన్ మస్తానమ్మ, హెచ్‌వీ సుశీల, ఎంఎల్‌హెచ్‌పీలు, పీఆర్ఓ వెంకట్రావు, ఆరోగ్య, ఆశ, కార్యకర్తలు పాల్గొన్నారు.

గౌడ విద్యార్థికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న గౌడ సంఘ నాయకులు

గిద్దలూరు రూరల్: మండలంలోని బురుజుపల్లె గ్రామానికి చెందిన అంతటి శ్రీనివాసులు ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో అతడి కుమారుడు చతుర్వేద్ ఉన్నత చదువుల కోసం గురువారం గౌడ సంఘ నాయకులు రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. గౌడ సంఘం అధ్యక్షుడు బత్తిని వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆర్థిక సాయం చేశారు. సంఘ నాయకులు డాక్టర్ జేవీ నారాయణ, కంచర్ల కోటయ్యగౌడ్, కంచర్ల రంగప్రసాద్ గౌడ్, పుల్లయ్య గౌడ్, ఇల్లూరి వెంకటేశ్వర్లు గౌడ్, ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల సమస్యలు పరిష్కరించాలి



సమావేశమైన ముస్లిం మైనార్టీ నాయకులు

గిద్దలూరు రూరల్: ముస్లిం మైనార్టీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ముస్లిం మైనార్టీల సంఘ అధ్యక్షుడు గుడిసె మహబూబ్‌బాష కోరారు. పట్టణంలోని కొంగలవీడు రోడ్డులోని బిలాల్ మసీదు ఆవరణలో గురువారం నియోజకవర్గ మైనార్టీ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మసీదుల్లోని ఇమామ్‌లు, మౌజన్ల వేతనాలు చెల్లించాలని, మసీదులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. హుస్సేన్, పీరా, చాంద్‌బాషా, ఇబ్రహీం పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

కొమరోలు: మండలంలోని ఎస్.బొంతపల్లె ఎంపీపీ పాఠశాలను మండల విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వర్లు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించాలి



విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈఓ

త్రిపురాంతకం: విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలని ఎంఈఓ కె.తులసి మల్లికార్జున నాయక్ సూచించారు. మండలంలోని మిట్టపాలెం పాఠశాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఇంగ్లిష్, గణితం సామర్థ్యాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. విద్యార్థులకు మధ్యాహ్నం రుచికరంగా భోజనం అందించాలన్నారు. విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పనిచేయాలని మల్లికార్జుననాయక్ సూచించారు. ఆయన వెంట హెచ్ఎం ప్రసాద్, సీఆర్‌పీ డానీ బాబు ఉన్నారు.

పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలి

కంభం: ప్రైవేటు పాఠశాలల్లో బలహీన వర్గాలకు చెందిన పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలని మండల విద్యాశాఖాధికారి మాల్యాద్రి సూచించారు. గురువారం స్థానిక గౌతమ్ స్కూల్, కృపామృత పబ్లిక్ స్కూల్, వెంకటేశ్వర అన్ ఎయిడెడ్ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం మండలంలోని అన్ని ప్రైవేటు, యాజమాన్యాల పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి 25 శాతం సీట్ల కేటాయింపును కచ్చితంగా అమలు చేస్తున్నట్లు సంబంధిత ప్రభుత్వ ఆదేశ పత్రాలను నోటీసు బోర్డులో ఉంచాలన్నారు.

వాహనదారులకు మెరుగైన వసతులు



పెట్రోల్ బంకులో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్

ముండ్లమూరు: వాహనదారులకు పెట్రోలు బంకు యజమానులు మెరుగైన వసతులు కల్పించాలని తహసీల్దార్ ఉషారాణి సూచించారు. మండలంలోని బృందావనం, పులిపాడు, ముండ్లమూరు, శంకరాపురం, మారెళ్ల, ఈదర గ్రామాల్లో పెట్రోల్ బంకులను ఆమె గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పెట్రోల్ బంకులో పిల్లర్ పేపర్, లీగల్ మెట్రాలజీ, బీఫాం, సామర్థ్య సాంద్రత కలిగి ఉండాలన్నారు. బంకులో తాగునీరు, జనరేటర్, గాలి మిషన్, మరుగుదొడ్లు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. కల్తీ పెట్రోల్ అమ్మితే లైసెన్స్ రద్దు చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆమె వెంట సర్వే డిప్యూటీ తహసీల్దార్ రవికాంత్, వీఆర్వోలు కోలయ్య, రమణ, గురవయ్య, దయానందం ఉన్నారు.

తూర్పుగంగవరం కార్యదర్శిగా మరియప్రసాద్

తాళ్లూరు: మండలంలోని తూర్పుగంగవరం గ్రామ కార్యదర్శిగా మరియప్రసాద్‌ను నియమిస్తూ ఎంపీడీఓ కేవై కీర్తి గురువారం ఉత్తర్వులిచ్చారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్న అల్లం వెంకటేశ్వర్లు స్థానంలో కలెక్టర్ ఆదేశాల మేరకు మరియప్రసాద్‌ను నియమించినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

భగత్ సింగ్‌కు ఘన నివాళి

దర్శి: భగత్‌సింగ్ ఆశయాలు కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ నడుం కట్టాలని సీపీఎం కార్యదర్శి కేవీ పిచ్చయ్య అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో భగత్ సింగ్ 92వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పిచ్చయ్య మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లు దేశ స్వాతంత్ర్యం కోసం, సమసమాజస్థాపన కోసం పోరాడి ఉరికంబం ఎక్కారన్నారు. నాయకులు తాండవ రంగారావు, సందు ఆంజనేయులు, ఉప్పు నారాయణ, జాన్, కాలేబాషా, అంజిబాబు, లక్ష్మి, సురేష్, బాజీ పాల్గొన్నారు.



భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న విద్యార్థులు

తాళ్లూరు: యువత భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాటం చేయాలని వక్తలు అన్నారు. పలు ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో గురువారం భగత్‌సింగ్ , రాజ్ గురు, సుఖదేవ్‌ల 92 వర్ధంతి నిర్వహించారు. బొద్దికూరపాడు ఎంపీపీఎస్ (ఎస్సీ, వీఆర్) పాఠశాలలో భగత్ సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారు దేశం కోసం చేసిన సేవలను కొనియాడారు. ప్రధానోపాధ్యాయుడు పోలంరెడ్డి సుబ్బారెడ్డి, ఉపాధ్యాయుడు శ్రీమన్నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.